ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



దివ్యాంగులకు లబ్ధి చేకూర్చాలి

ఆసిఫాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఇందిరమ్మ ఇళ్లు కొత్త రేషన్‌కార్డులలో దివ్యాంగులకు లబ్ధి చేకూరేలా ప్రత్యేక కోటా కేటాయించాలని శుక్రవారం దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇస్లాంబీన్ హసన్ మాట్లాడుతూ జీవో 33 ప్రకారం దివ్యాంగులకు ఐదు శాతం కోటా కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు ఖయ్యూం, శ్రీనివాస్, రాజయ్య, రాజేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో శుక్రవారం ఓటు యొ క్క ప్రాముఖ్యతపై మండల స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి అలీజా సాహిజాన్ గెలుచుకున్నాడు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రెబ్బెన, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉద్ధవ్ అన్నారు. శుక్రవారం రెబ్బెన మండలం గోలేటి ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేపటితో ముగియనున్న గడువు

- 26 వరకే మున్సిపల్ పాలకవర్గాల పాలన
- 27 నుంచి ప్రత్యేక అధికారులకు బాధ్యతలు
- ఎన్నికలకు ఆశావహుల ఎదురుచూపులు



కాగజ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్ పాలకవర్గం గడువు ఆదివారంతో ముగియనుంది. 2020 జనవరి 21న కౌన్సిలర్ల ఎన్నికలు నిర్వహించారు. 27న పాలవకర్గం కొలువు దీరింది. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కైవసం చేసుకుంది. మొత్తం 30 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 22 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు గెలుపొందారు. కాగా కాంగ్రెస్ 6 స్థానాలు, స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు విజయం సాధించారు. మున్సిపల్ ఛైర్మన్‌గా సద్దాం హుస్సేన్‌ను, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా రాచకొండ గిరిష్‌ను మెజార్టీ సభ్యులు ఎన్నుకున్నారు. నాలుగేళ్ల పాటు సాఫీగా కొనసాగింది.

కాగా అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అవిశ్వాస తీర్మానాలు పెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2023 డిసెంబరులో నిర్వహించిన అవిశ్వాస మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్‌పై నెగ్గడంతో కొత్తగా మున్సిపల్ ఛైర్మన్ షాహిన్ సుల్తానా, వైస్ ఛైర్మన్‌గా రాజేందర్ ఎన్నికయ్యారు. ఈ నెల 26న పురపాలక సంఘ పాలకవర్గం పదవీ ముగియనుంది. గత ఐదేళ్ల పాలనలో మున్సిపాల్టీ అభివృద్ధి కానసాగాయి.

ఎన్నికల వైపు అడుగులు..

కాగజ్‌నగర్ మున్సిపల్ పాలకవర్గం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కోసం నిర్వహించేందుకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఓటరు జాబితాను సిద్ధం చేసింది. సర్పంచ్ ఎన్నికలు తొలుత నిర్వహించనున్నారు. అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల జరిగే అవకాశాలున్నాయి. ఈ ప్రక్రియ కాగానే తిరిగి మున్సిపల్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. కాగజ్‌నగర్‌లో 30 వార్డులపై ప్రధాన పార్టీల నాయకులు గెలుపు గుర్రాల కోసం వేట మొదలెట్టారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాగజ్‌నగర్‌పై పట్టు సాధించేందుకు 30 వార్డుల్లో కీలక అభ్యర్థుల కోసం వేట షురూ చేస్తున్నారు. గత ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌లో ఉన్న కోనేరు కోనప్ప తమ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రచారం చేశారు.

కాగా ఈ సారి ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పరిస్థితి మారిపోనుంది. ఇప్పటికే మెజార్టీ కౌన్సిలర్లు పూర్తిగా కాంగ్రెస్ వైపు తిప్పుకోగా పూర్తిగా పట్టుపెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా సిర్పూరు సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు తన క్యాడర్‌ను నిరూపించేందుకు బీజేపీ తరుపున కీలక అభ్యర్థులను బరిలో నిలిపే అవ కాశాలున్నాయని చెబుతున్నారు.

ఇక అధికారుల పాలన..

పాలకవర్గ సభ్యులు పాలన ఆదివారంతో ముగిసిన అనంతరం 27 నుంచి ప్రత్యేక అధికారిని నియమించనున్నారు. ఈ అధికారి ఆధ్వర్యంలో పర్యవేక్షణ కొనసాగనుంది. అలాగే 30 వార్డులకు 30 మంది ప్రత్యేక వార్డు అధికారులను నియమించారు. ప్రస్తుతం వార్డు అధికారులు, కౌన్సిలర్లు సంయుక్తంగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తుండగా, ఇక నుంచి పూర్తి బాధ్యత వార్డు అధికారులదేనని చెబుతున్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గం కొలువుదీరే దాకా వీరే బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక పాలన అధికారుల తీరు ఎలా ఉండబోతున్నదనే చర్చ సాగుతోంది.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

ఆసిఫాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని ఏఎంవీఐ రాజమల్లు అన్నారు. శుక్రవారం టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా డ్రైవర్స్ డే రోజును పురస్కరించుకుని రోడ్డు భద్రతపై ఆర్టీసీ డిపో నుంచి కుమరం భీం చౌక్ వరకు విద్యార్థులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు నడిపే సమయంలో ప్రశాంతమైన మనస్సుతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం విశ్వనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో పొగమంచు ఉన్న సమయంలో వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగ మంచు ప్రాంతంలో వేగం తగ్గించాలని, ముందు వాహనంతో ఎక్కువ దూరాన్ని ఉంచాలని చెప్పారు. ఫాగ్ లైట్స్ ఉంటే ఉపయోగించాలని, విండోలను శుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఇంటర్సెక్షన్స్, అప్రోచ్ రోడ్లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓవర్ టేకింగ్ చేయకూడదని తెలిపారు.

జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ అండర్-19 సాఫ్ట్ బాల్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలకు చెందిన విద్యార్థులు గోపాల్, విక్కీ ఎంపికయ్యారు. ఈ నెల 24 నుంచి 28 వరకు ఔరంగాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ యాదగిరి, ఉపాధ్యాయులు రహీం, శంకర్, ప్రసాద్, సంతోష్, సురేందర్, బాబురావు అభినందించారు.

మహిళా చట్టాలపై అవగాహన

సిర్పూర్(టి), జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీఎస్ హైస్కూల్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో షీ టీం సభ్యులు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యురాలు సునీత మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైమ్‌లకు ఎవరైనా గురైనట్లయితే వెంటనే షీ టీంలను సంప్రదించాలన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 8712670565 ను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబశివుడు, షీ టీం సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామసభలో అర్హుల జాబితా వెల్లడి

సిర్పూర్(టి), జనవరి 24(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ప్రారంభమైన గ్రామ సభలు శుక్రవారంతో ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. చివరి రోజు సిర్పూర్(టి), వెంపల్లి గ్రామ పంచాయతీ కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు ఆయా శాఖల అధికారుల నివేదికలను చదివి వినిపించారు. నివేదికలను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో గిరీష్, ఈవో తిరుపతి, ఎంఆర్ఐ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

కౌటాల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పార్ద గ్రామంలో సమాచారం లేకుండా ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించిన గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం గ్రామస్థులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామ సభను రద్దు చేసి గిరిజన గ్రామంలో తిరిగి గ్రామ సభ ను నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు.

డీఎంఎఫ్‌టీ నిధుల మంజూరుకు వినతి



సీఎండీ బలరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ నగేష్

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు సింగరేణి డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయాలని శుక్రవారం ఎంపీ నగేష్, బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అంతకు ముందు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింబగరేణి మంజూరు చేసే నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు, మురికి కాలువలు ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. సీఎండీ త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

రెబ్బెన, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఉద్ధవ్, జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో టీఎస్‌డబ్ల్యూటీయూ క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

జైనూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెండాగూడ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యం కావడంతో శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాలు ప్రకారం.. జెండాగూడకు చెందిన ఓ యువతికి అదే గ్రామానికి చెందిన యువకుడితో ఏడాది క్రితం వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో సంతానం కలుగడం లేదని దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 21న కుల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇద్దుకు విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనంతరం గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన యువతి ఇంటికి రాలేదు. రాత్రి నుంచి కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలు ఆందోళన చెందొద్దు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



వాంకిడిలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



తేజాపూర్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

వాంకిడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అర్హులందకీఈ సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఆందోళన చెందొద్దని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామంలో శుక్రవారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలపై నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. గతంలో ప్రజాపాలన, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల గణన సర్వే, ప్రజావాణి కార్యక్రమాలలో అందిన దరఖాస్తులను క్రోడీకరించి ఇంటింటా సర్వే గ్రామాల్లో సర్వే నిర్వహించి జాబితాలను రూపొందించడం జరిగిందని తెలిపారు. అర్హత కలిగి ఉండి జాబితాలో పేర్లు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జాబితాలో అర్హులు కాని వారి పేర్లు ఉంటే తెలియజేయాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండలంలోని రాంజపేట గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న గ్రామ సభలో పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏడీఏ మిలింద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తేజాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లా డారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, గిర్దావర్ మజీద్, తదితరులు పాల్గొన్నారు. కిరిడి గ్రామంలో శుక్రవారం నిర్వహిం చిన గ్రామసభలో అధికారులపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో అందించిన దాదాపు 108 దరఖాస్తులను కార్యదర్శి ఆన్‌లైన్‌లో నమోదు చేయక పోవడం వల్ల అర్హులైన వారికి ఇళ్ల మంజూరులో పేర్లు రాలేదని వాగ్వాదానికి దిగారు. దరఖాస్తులు చేసుకుం టే అర్హులందరికీ అందేలా చూస్తామని అధికారులు చెప్పడంతో శాంతించారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): అర్హులకు ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎవరు కూడ నిరుత్సహానికి గురి కావద్దని తిర్యాణి మండల ప్రత్యేకాధికారి, గిరిజన సంక్షేమ డీడీ రమాదేవి అన్నారు. శుక్రవారం తిర్యాణి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎస్ఐ శ్రీకాంత్, ఏపీవో ఉస్మానీ, ఏఈవో వినోద్, కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాం, జైనూరు మేజర్ గ్రామ పంచాయతీలలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలలో డీఆర్డీవో పీడీ బానోత్ దత్తారావ్ పాల్గొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో మోహన్, ఈవో కోరేంగ ఆనంద్‌రావ్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ మాజీ సర్పంచులు పార్వతీబాయి, కుంర శాంరావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరస్కోల సుదర్శన్, ఎస్సై సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాండేయేర్, నేట్నూర్, మహగాం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఎంపీడీవో కృష్ణారావు, ఎస్సై రామకృష్ణారావు, వ్యవసాయ అధికారి ఆనంద్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ మడావి చిత్రు తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్లబోరి, గురుడుపేట రైతు వేదికలో రైతు భరోసా పథకానికి కొత్తగా వచ్చిన రైతుల వివరాలు ఏఈవోలు అంజన్న, రేష్మిత శుక్రవారం వివరాలు సేకరించారు. కొత్తగా పట్టా పాసు పుస్తకాలు వచ్చిన రైతులందరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామంలో శుక్రవారం అధికారులు విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు లేవంటూ నిరసనకు దిగారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లను అధికారులు చదువుతున్న సమయంలో ఒక్కసారిగా అర్హులు జాబితాలో తమ పేర్లు లేవని పేర్లు గల్లంతు అయ్యాయని ఆందోళనకు దిగారు. ఇందిరమ్మ కమిటీలో ఎవరి పేర్లు ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకాదికారి అభిలాష్ మాట్లాడుతూ జాబితా ఫైనల్ కాదని అర్హుల పేర్లు తప్పితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సై ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చ జెప్పి బయటకు పంపించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేష్, ఏఈఓ మీనా తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో పలువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అధకారులు ప్రకటించిన జాబితాలో తమ పేర్లు లేవంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితాలో తప్పులు దొర్లయని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజ ద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఏపీవో మల్లయ్య, కార్యదర్శి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



తిర్యాణి గ్రామసభలో మాట్లాడుతున్న డీడీ రమాదేవి

గ్రామసభలో గందరగోళం

- అధికారులతో ప్రజల వాగ్వాదం
- దరఖాస్తులు చేసుకోవాలని సూచన



రెబ్బనలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

రెబ్బెన, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా అధికారులు లబ్ధిదారుల జాబితాను చదివి విన్పించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హుల జాబితాను చదువుతుండగా, కొంత మంది స్థానికులు అడ్డుకున్నారు. లక్షాధికారులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో చోటు కల్పించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డీపీవో భిక్షపతి గౌడ్ మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వాసు, కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు. కాగా రెబ్బెన మండలం గోలేటి సభలో లబ్ధిదారుల జాబితాలో అనర్హులకు చోటు కల్పించారని, అర్హులకు అవకాశం ఇవ్వలేదని అఖిల పక్షం నాయకులు శుక్రవారం గోలేటి కమ్యూనిటీ హాలు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బాబురావు, బీజేపీ నాయకుడు అంజనే యులు, ఏఐటీయూసీ నాయకుడు ఉపేందర్ మాట్లాడుతూ ఇందిర మ్మ ఇళ్ల జాబితాలో అనర్హులకు చోటు కల్పించడం సమంజం కాదన్నారు. అర్హులైన వారికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. న్యాయం చేసేంత వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

దహెగాం,(ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లను ఆయా శాఖల అధికారులు చదివి వినిపించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని ఒకే కుటుంబంలో ఇద్దరికి మంజూరు అయ్యాయని ప్రజలు మండిపడ్డారు. సమాచారం అందుకున్న ఏఎస్సై రమేశ్, పోలీసులు ప్రజలను సముదాయించారు. గ్రామ సభలో ప్రజలు వాగ్వాదానికి దిగిన విషయాన్ని కలెక్టర్‌కు ఫోన్‌లో ఎంపీడీవో రాజేందర్ వివరించారు. పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచన మేరకు ప్రజలు శాంతించారు. అనంతరం దరఖాస్తులను అధికారులు తీసుకున్నారు. ఖర్జీ, దాంపూర్, మొట్లగూడ, పెసరికుంట, ఒడ్డుగూడ, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

ఎమ్మార్సీలకు ఊరట

- ఆరునెలల తర్వాత నిధులు విడుదల



ఆసిఫాబాద్‌లోని ఎమ్మార్సీ కార్యాలయం

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న మండల వనరుల కేంద్రాలకు ఊరట లభించింది. కొంత కాలంగా ఎమ్మార్సీలకు నిధులు విడుదల కాకపోవడంతో కార్యాలయాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం నిర్వహణ నిమిత్తం సమగ్ర శిక్షా ద్వారా నిధులను విడుదల చేసింది.

విద్యా సంవత్సరం మొదలైనప్పటి నుంచి

ఈ విద్యా సంవత్సరం మొదలైనప్పటి నుంచి మండల వనరుల కేంద్రాలకు నిర్వహణ నిధులు విడుదల కాలేదు. గతంలో పాఠశాల నిర్వహణకు సంబంధించి తొలి విడతగా నిధులు విడుదల చేసిన సమయంలో వాటితో పాటు ఎమ్మార్సీలకు వచ్చేవి. ఏటా జూలై, ఆగస్టు నెలలో పాఠశాల నిధులతో పాటు ఎమ్మార్సీ నిధులు విడుదల కావాల్సి ఉంది. కాగా పాఠశాల నిధులు విడుదలయిన ప్పటికీ ఎమ్మార్సీ నిధులు విడుదల కాలేదు. కానీ ఈ సారి పాఠశాల నిర్వహణ నిధులు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఎమ్మార్సీ కార్యాలయాల నిర్వహణ, ఇతర ఖర్చులకు నిధులు లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహణ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో ప్రభుత్వం 50 శాతం నిధులను విడుదల చేసింది. ఒక్కో ఎమ్మార్సీకి రూ. 41, 460 చొప్పున మంజూరు చేసింది. దీంతో జిల్లాలోని 15 ఎమ్మార్సీలకు రూ. 6,21,900 వచ్చాయి. ఈ నిధులను కార్యాలయ నిర్వహణ, సమావేశాల ఏర్పాటు, విద్యుత్ చార్జీలు తదితర వాటికి వినియోగించనున్నారు.

50 శాతం నిధులు వచ్చాయి

రాథోడ్ సుభాష్, ఎంఈవో, ఆసిఫాబాద్



జూలై, ఆగస్టులో ఎమ్మార్సీలకు రావాల్సిన నిధులు ఆరు నెలల తర్వాత విడుదలయ్యాయి. ఎమ్మార్సీకి ఏటా రూ. 82,920 రావాల్సి ఉంది. ప్రస్తుతం 50 శాతం విడుదలయ్యాయి.

వార్డుసభల్లో దరఖాస్తులు స్వీకరించాం

- పెద్దింటి క్రాంతి, మేనేజర్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ



ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఏఏ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు.

మేనేజర్ : కాగజ్‌నగర్ పట్టణంలో ఈనెల 21, 22 తేదీల్లో వార్డుసభలు నిర్వహించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాం.

ఆంధ్రజ్యోతి : పట్టణంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. వార్డుసభల్లో ఎలాంటి విధి విధానాలు పాటించారు?

మేనేజర్ : కాగజ్‌నగర్ పట్టణంలోని 30 వార్డులకు గానూ ఇప్పటి వరకు 2,800పైగా కొత్త దరఖాస్తులు వచ్చాయి. 15 వార్డులుగా విభజించి 2 రోజుల పాటు అధికారులు, సి బ్బంది పాల్గొన్నారు. గతంలో వచ్చిన జాబితాలపై అభ్యంతరాల నమోదు, ఇతరత్ర విషయాలను వార్డుల వారీగా నమోదు చేసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందుతున్నారు దీనిపై తీసుకుంటున్న చర్యలు ఏంటీ?

మేనేజర్: గతంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే లిస్టులో పేర్లు లేని వారు, రేషన్‌కార్డులకు కూడా దరఖాస్తులు స్వీకరించాం. ఇది నిరంతర ప్రక్రియగా ఉంటుందని ఉన్నతాధికారులు ప్రకటించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దరఖాస్తులను పరిశీలించి నిబంధన మేరకు అర్హులను ఎంపిక చేయాలని మార్గదర్శకాలున్నాయి.

- కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మత్తడికి మరమ్మతులెప్పుడో?

- నాలుగేళ్ల క్రితం వరదలకు కొట్టుకుపోయిన ఖర్జీ చెరువు మత్తడి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

దహెగాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని ఖర్జీ చెరువు మత్తడి నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. 2020లో మత్తడికి బుంగ పడింది. దీంతో అప్పటి కలెక్టర్ సందీప్‌కుమార్ ఆదేశాల మేరకు సర్పంచ్, వివిధ శాఖల అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మళ్లీ 2021లో భారీవర్షాలు కురవడంతో వరద ప్రవాహానికి మత్తడి కొంతమేరకు కొట్టుకు పోయింది. దీంతో చెరువులో చుక్కనీరు నిలువ ఉండడం లేదు. పశువులకు సైతం తాగడానికి చుక్క నీరు దొరకని పరిస్థితి నెలకొంది.

• ఆయకట్టు రైతుల అవస్థలు..

చెరువు ఆయకట్టు భూములు సాగు చేయడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆర్థిక స్థోమత గల రైతులు బోరులు వేసుకుని వరిపంటలను సాగు చేస్తున్నారు. మరికొంత మంది రైతులు అప్పులు చేసి బోరులు వేసి పంటలు సాగుచేస్తున్నారు. 2003లో కోటి రూపాయలతో చెరువుకట్ట నిర్మాణం పనులను పూర్తి చేశారు. సుమారు 100ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించాల్సిన లక్ష్యం ఉంది. మిషన్ కాకతీయ పథకంలో పూడిక మట్టిని తీసి కట్టను చదునుచేశారు. కాలువ, తూము మత్తడి మరమ్మతులు పనులు చేపట్టక పోవడంతోనే భారీ వర్షాలకు చెరువుకట్ట మత్తడి ఒకవైపు కొట్టుకు పోయిందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చెరువు మత్తడితో పాటు కాలువ మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ భద్రయ్యను ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందు బాటులోకి రాలేదు. కాగా మత్తడి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.



వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన మత్తడి

అడుగంటిన భూగర్భ జలాలు..

- రైతు లక్ష్మణ్, రైతు



చెరువులో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. చెరువు ఆయకట్టు కింద నాలుగు ఎకరాల వరిపొలం ఉంది. బోర్‌వెల్ వేసుకున్నాం. వరి సాగు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మరమ్మతులు చేపట్టాలి

మత్తడికి మరమ్మతులు చేపట్టాలి..

- ఎల్కరి దామోదర్, రైతు



చెరువు కట్ట మత్తడి కొట్టుకుపోయి నాలుగేళ్లు అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. మత్తడికి మరమ్మతులు పూర్తయితే చెరువులోనీరు చేరి పంటలు సాగు చేయ డానికి అనుకూలంగా ఉంటుంది. అధికారులు ఇబ్బందులు తొలగించాలి.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

వేమనపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండల కేంద్రంలో శుక్రవారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తూ నలుగురిపై దాడి చేసి కరిచాయి. గ్రామానికి చెందిన గాండ్ల వెంకటి, తొర్రె వెంకటి, కంపెల మల్లక్క, సరితలపై కుక్కలు దాడి చేయడంతో కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికరైసుమిల్లు నుంచి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వరకు కుక్కలు వెంబడించి ఒకరి తర్వాత ఒకర్ని కరిచాయి. గాయాలపాలైన వారిని స్థానికులు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్సలు చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాండ్ల వెంకటికి తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజులుగా పిచ్చికుక్కలు తిరుగుతూ బాట సారులను కరుస్తుండడంతో ప్రజలు భయాందోళనలకుగురవుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



గాయాలపాలైన గాండ్ల వెంకటి

కాలువలో పడి ఒకరి మృతి

తాండూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలా పూర్ గ్రామపంచాయతీ శివారులో ఉన్న పెద్దమడుగు సమీపంలోని కాలువలో పడి చాకెపల్లికి చెందిన జక్కుల మొండి (50) మృతిచెందినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మొండి ఈ నెల 23న సాయంత్రం చేపలు పట్టడానికి పెద్దమడుగుకాలువ వద్దకు వెళ్తున్నానని కుటుంబీకులతో చెప్పి వెళ్లాడు. కాలువలో చేపలు పడుతుండగా వల కాళ్లకు, చేతులకు చుట్టుకుని కాలువలో మునిగి మృతి చెందాడు. ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో కాలువ వద్దకు వెళ్లి చూడగా కాలువలో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. మొండి తల్లి వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ తెలిపారు. మొండికి భార్య కవిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



మొండి(ఫైల్)

నాటు సారా స్థావరాలపై దాడులు

కోటపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వాయిపేట, ఎసన్‌వాయి గ్రామాల్లో శుక్రవారం గుడుంబా స్థావరాలపై పోలీసు , ఎక్సైజ్ శాఖల అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుడుంబా తయారీకి ఉపయోగించే 900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. దాడుల్లో పోలీసులతో పాటు మంచిర్యాల, ఆదిలాబాద్ ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని రహపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 3,800 నగదు, మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీన పరుచుకున్నామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మధు, రమేష్, సంజీవ్, దేవెందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

జన్నారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కూకటికారి రమేష్ (47) మృతదేహం డేరాన్ దేశం నుంచి స్వగ్రామానికి శుక్రవారం చేరుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రమేష్ రెండేళ్ల క్రితం బతుకు దెరువు కోసం వలస కూలీగా డేరాన్‌దేశం వెళ్లాడు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ నెల 20న మృతి చెందాడు. దీంతో గ్రామ మాజీ సర్పంచు జాడి గంగాధర్ , గల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు మాటేటి కొమురయ్యలు ఎన్ఆర్ఐ చీఫ్ సెక్రటరీ బుచ్చిబాబుకు సమాచారం ఇవ్వడంతో నాలుగు రోజుల్లో మృతదేహం స్వగ్రామానికి చేరింది. రమేష్ మృతితో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. రమేష్ భార్య చంద్రిక, కుమార్తె కావ్యలు రోధించిన తీరు పలువురిని

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

హాజీపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంనూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నలిమెల సంధ్యారాణి విధులకు ఆటంకం కలిగించిన అదే గ్రామానికి చెందిన అత్తె సాగర్, ఒడ్నాల సత్యనారాయణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సంధ్యారాణిని అదే గ్రామానికి చెందిన అత్తె సాగర్, ఒడ్నాల సత్య నారాయణలు వారికి చెందిన భూమి పక్కన దారి ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఇవ్వమని అడిగారు. రెవెన్యూ శాఖకు సంబంధించినదని, వారిని సంప్రదించాలని చెప్పినా కూడా వినకుండా ధృవీకరణ పత్రం మీద సంతకం చేయాలని కార్యదర్శిపై దౌర్జన్యం చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించడం భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మందమర్రి టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాష్ట్రీయ రహదారి పాత బస్టాండ్ సమీపం లో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొన్న సంఘటనలో పిల్లల మర్రి లలిత (57) అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై రాజశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న టీఎస్ 29టీబీ9963 డ్రైవర్ అతి వేగంగా నడ పడంతో ప్రమాదం జరిగిందని, తీవ్ర గాయాలతో లలిత అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. కొడుకు ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురుకి జైలు శిక్ష

మంచిర్యాల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణ పరిధి లో మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి జైలు శిక్ష విధించినట్లు మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షల్లో మద్యం సేవించి పట్టుబడిన వారిని కోర్టులో రి మాండ్ చేశారు. మంచిర్యాల సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి నిరోష 29 మం దికి 65 వేల రూపాయల జరిమానా విధించారు. నలుగురికి ఐదు రోజుల జై లు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. వాహన దారుడు నియ మాలు పాటించాలని కోరారు.

యువతి అదృశ్యం

జైనూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివనూర్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని శివనూర్ గ్రామానికి చెందిన యువతి(20) భద్రాచలంలోని పాల్వంచ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. సంక్రాంతి పండుగ సెలవులు కావడంతో స్వగ్రామమైన శివనూర్‌కు వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 20న ఉదయం కళాశాలకు వెళ్తానని ఇంటి నుంచి ఆటోలో జైనూరు నుంచి బయలు దేరింది. ఆ రోజు ఉదయం 11.30 గంటలకు తండ్రి పవార్ సుభాష్ కూతురికి ఫోన్ చేశాడు. తను బస్సులో ఉన్నానని, తర్వాత ఫోన్ చేస్తానని చెప్పింది. మధ్యాహ్నం యువతి తండ్రి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మూడు రోజులుగా బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

సిర్పూర్(యు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని గోండి ధర్మకోయపూన్నే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావు అన్నారు. మండలంలోని పన్‌గాడిగూడలో శుక్రవారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మరావు, ఆసరా స్వచ్ఛంద సంఘం అధ్యక్షుడు శంకర్, పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

వాంకిడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఈ నెల 28న నిర్వహించే రెండు రాష్ట్రాల పీడీఎస్‌యూ విలీనసభ కరపత్రాలను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు లేనిన్ శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, నంద కిశోర్, హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిని వేధిస్తున్నాడని తండ్రిని చంపిన కొడుకు

జైపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ఇందారం గ్రామంలో తల్లిని వేధిస్తున్నాడనే కారణంతో గురువారం రాత్రి తండ్రిని కన్న కొడుకు హత్య చేశాడు. ఎస్ఐ శ్రీధర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన ఆవిడపు రాజయ్య (45) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. రాజయ్యకు భార్య భాగ్య, కొడుకు సాయిసిద్దార్థ, కూతురు యోగిత ఉన్నారు. సాయిసిద్దార్థ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కూతురుకు వివాహం అయ్యింది. రాజయ్య కొంత కాలం నుంచి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యతో నిత్యం గొడవ పడుతున్నాడు. కొద్ది రోజుల క్రితం రాజయ్య భార్యతో గొడవ పడి, కొడుకుపై కూడా దాడి చేశాడు. దీంతో భాగ్య నస్పూర్‌లో ఉంటున్న తన అన్నయ్య ఇంటికి కొడుకును తీసుకుని వెళ్లిపోయింది. కొద్ది రోజులుగా తల్లీకొడుకు నస్పూర్‌లోనే ఉంటున్నారు. తండ్రికి ఎంత నచ్చ జెప్పినా ప్రవర్తన మార్చుకోవడం లేదని అతడిని అంతం చేయాలనుకున్నాడు. సాయి సిద్దార్థ తన స్నేహితులు పొట్టాల వినయ్, జనంపల్లి సందీప్‌లతో కలిసి పథకం పన్నాడు. గురువారం రాత్రి సాయి సిద్దార్థ తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఇందారంలో ఉంటున్న తండ్రి వద్దకు వచ్చి గొడవ పడ్డాడు. స్నేహితులు సహకరించడంతో సాయిసిద్దార్థ తండ్రి రాజయ్య గొంతును కత్తితో కోసి హత్యచేశాడు. అనంతరం తండ్రి నడిపే ఆటో తీసుకుని సాయి సిద్దార్థ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఇద్దరు స్నేహితులు వినయ్, సందీప్‌లు పరారీలో ఉన్నారు. శుక్రవారం ఉదయం సంఘటన స్థలాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ ఇన్‌చార్జీ సీఐ రవీందర్‌లు సందర్శించి హత్య జరిగిన తీరును పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రాజయ్య (ఫైల్)

మెరుగైన వైద్య సేవలు అందించాలి

వాంకిడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారంతనిఖీ చేశారు. వార్డులు, ఔషధ నిలువలు, రిజిస్టర్‌లు, పారిశుధ్య నిర్వహణ, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజల పట్ల వైద్యులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని, వారి ఆరోగ్య సమస్యలపై మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందుల నిలువలు అందుబాటులో ఉంచాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

సిర్పూర్(యు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని మేటిగూడ గ్రామంలో అంగన్‌వాడీ భవనం పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆదవాసీ నాయకుడు పెందోర్ దత్తు, నాయకులు పెందోర్ మాధవ్‌రావు, మాజీ సర్పంచ్ మెస్రం భూపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మండాడీ లింగు, నాయకులు ఆత్రం శంకర్, పెందోర్ ప్రకాష్, కనక గంగారాం, ఆత్రం దత్తు తదితరులు పాల్గొన్నారు.

రేపు 2కే రన్

వాంకిడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ఏఎస్పీ చిత్తరంజన్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు విలాస్, హంసరాజ్, విజయ్, సురేష్, రోషన్, మనోజ్, దీపక్, పాండు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ఆసిఫాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు ఎస్ఈ కార్యాలయం ఎదుట చేపడుతున్న దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆర్టిజన్ కార్మికుల దీక్షలకు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు. క్యాక్రమంలో మారుతి, నసీరుద్దీన్, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.



సులభ్ కాంప్లెక్స్‌ల కూల్చివేతను అడ్డుకోవాలి

మందమర్రి టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సులభ్ కాంప్లెక్స్‌లను కూల్చివేతలను యాజమాన్యం అడ్డుకోవాలని శుక్రవారం మందమర్రి సివిల్ ఎస్ఈకి ఐఎఫ్‌టీయూ అనుబంధ సులభ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపెల్లి శ్రీనివాస్, మల్లేష్, సురేందర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతున్నాం

మందమర్రి టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉ ద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తుందని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీవెల్ఫేర్ అసోసియేషన్ క్యాలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం పొందాల్సిన రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ వారు కూడా సంస్థ అభివృద్దే లక్ష్యంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం, ఇతర అధికారులు, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, దాసరి సుదర్శన్, భూపెల్లి కనకయ్య, వాసాల శంకర్, వై శ్రీను, పోశన్న, నాయిని శంకర్, రాజేష్, పులిపాక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ వెలికితీస్తున్న జీవీఆర్ కంపెనీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అఫ్రోజ్‌ఖాన్, దూలం శ్రీనివాస్, కొండపర్తి శంకర్, అగ్గు మల్లేష్ కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణకు వినతిపత్రం అందించారు. పలువురు మాట్లాడుతూ జీవీఆర్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ బోనస్ చెల్లించాలని కోరారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు అందించాలని చెప్పారు. . కార్యక్రమంలో చక్రవర్తి, పవన్, మల్లేష్, ప్రసాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పని చేస్తే పదోన్నతులు

శ్రీరాంపూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాలతో ఉద్యోగాలు పొందిన యువత క్రమశిక్షణతో పని చేస్తే పదోన్నతులు పొందే అవకాశం ఉందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. 13 మంది యువతీ, యువకులకు జీఎం కార్యాలయంలో శుక్రవారం నియామ కపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీనియర్ ఉద్యోగుల సలహాలతో అధిక ఉత్పత్తి సాధించాలన్నారు. విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ కుటుంబాలకు ఆసరా అందించాలని కోరారు. ఇప్పటివరకు శ్రీరాంపూర్ ఏరియాలో 3,592 కారుణ్య నియామకపత్రాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, డీజీఎం(పర్సనల్) పి. అరవిం దరావు, సీనియర్ పీవో పి కాంతారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కారుణ్య నియామకపత్రం అందజేస్తున్న జీఎం సూర్యనారాయణ

రివైజ్డ్ పింఛన్ చెల్లించాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న సింగరేణి రిటైర్డు కార్మిక సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి రిటైర్డు కార్మికులకు రివైజ్డ్ పింఛన్ వెంటనే చెల్లించాలని శుక్రవారం సింగరేణి రిటైర్డు కార్మిక సంఘ నాయకులు జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2021 జులై నుంచి అమలైన 11వ వేజ్‌బోర్డు ఒప్పందానికి సంబంధించి వేతనాలపై పెరిగిన రివైజ్డ్ పింఛన్‌ను 11వ వేజ్‌బోర్డు కాల పరిమితిలో దిగిపోయిన వారికి వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గజెల్లి వెంకటయ్య, నర్సయ్యజ్ఞాని, రాధాకృష్ణనారాయణరాజు, రాజేశం, కుమారస్వామి, చంద్రయ్య, నర్సయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

శ్రీరాంపూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను అధికారులు ఎంపిక చేశారు. శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఉత్తమ సింగరేణి ఉద్యోగిగా ఆర్‌కే 5 గనికి చెందిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ అటికం శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఆయన కొత్తగూడెంలో సీఎండీ బలరాం చేతులమీదుగా సన్మానం అందుకోనున్నారు. ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా ఆర్‌కే 5 గని నుంచి సలాకల సతీష్, డి.లక్షణస్వామి, ఆర్‌కే 6 గని నుంచి గొర్రె నర్సయ్య, తుమ్మల రాజిరెడ్డి, ఆర్‌కే 7 గని నుంచి బుడమల గోపాల్ రెడ్డి, తుమ్మ జనార్ధన్, ఆర్‌కే న్యూటెక్ గని నుంచి వి. ఓదయ్య, డి. రామమూర్తి, ఎస్ఆర్‌పీ 1 గని నుంచి ఎం. ఓదెలు, వి. శంకరయ్య, ఎస్ఆర్‌పీ 3 గని నుంచి రాజశ్ లోధ్, ఆకేటి ఆదిరెడ్డి, ఐకే 1ఏ గని నుంచి కె. అశోక్ రెడ్డి, జాకిర్ హుస్సేన్, ఐకే ఓసీపీ నుంచి శ్రీనివాస్, పి పద్మరాజు, శ్రీరాంపూర్ ఓసీపీ నుంచి నల్లపు సంతోష్, గట్టయ్య ఎంపికయ్యారని అధికారులు తెలిపారు.

ముగియనున్న ముున్సిపాలిటీల పదవీకాలం..

(5వ పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వ్యవహరించే అవకాశం ఉంది. ఇప్పటికే ఆయన జిల్లా పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా కూడా కొనసాగుతున్నారు. బెల్లంపల్లి మున్సిపల్ ప్రత్యేకాధికారిగా అక్కడి ఆర్డీవో హరికృష్ణ బాధ్యతలు స్వీకరించే అవకాశాలు ఉండగా, మిగతాచోట్ల ప్రత్యేకాధికారుల ను నియామకం జరగాల్సి ఉంది.

● **అభివృద్ధి పనులు జరిగేనా..?**

గ్రామపంచాయతీలకు గతేడాది ఫిబ్రవరిలో కాల పరిమితి ముగియగా, మండల, జిల్లా పరిషత్‌లు ఆరు నెలల క్రితమే స్పెషల్ ఆఫీసర్ల పాలనలోకి వెళ్లాయి. అప్పట్లో మండల ప్రత్యేక అధికారులుగా జిల్లాలోని వేర్వేరు అధికారులకు ప్రత్యేక బాధ్యతలు ఇచ్చారు. తమ రెగ్యులర్ పనులకు అదనంగా ప్రత్యేకంగా స్థానిక సంస్థలను కూడా అప్పగించడంతో అధిక పనిభారం పడింది. దీంతో పూర్తిస్థాయిలో దృష్టిసారించక అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. కొన్ని చోట్ల మండలానికి ప్రత్యేకాధికారి ఎవరో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి ఉంది. నిన్న మొన్నటి వరకు ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, సమగ్ర సర్వేలాంటి పనుల్లో అధికారులు బిజీగా ఉన్నారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీల్లో మాత్రం అందుకు భిన్నంగా జరుగ నుంది. ఆయా వార్డుల్లో తరచూ వచ్చే సమస్యలు పారిశుధ్యం, తాగు నీరు, తదితర అత్యవసర పనులను తప్పనిసరిగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీంతో పని ఒత్తిడి మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

కాంగ్రెస్ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

హాజీపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుపై అసత్యఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయ కులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేంపల్లి మాజీ సర్పంచు డేగ బాపు, మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడారు. నంనూర్ గ్రామంలో ప్రభుత్వ పింఛన్ తీసుకున్న లబ్దిదారులు స్వచ్ఛందంగా ఇంటి పన్ను చెల్లిస్తే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, కాంగ్రెస్ నాయకు లు శ్రీనివాసరావు, సత్తయ్య సురేందర్, నాగయ్య, శంకర్, రవి, కుటుం బరావు, బాపు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం



సన్మానం పొందిన మున్సిపల్ కౌన్సిలర్లు

నస్పూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం చైర్మన్ సురిమిల్ల వేణు అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ అభివృద్ధిపై కౌన్సిల్ చర్చించింది. ఈ నెల 26తో పాలకవర్గ సభ్యుల కాల పరిమితి ముగుస్తుందన్నందున కౌన్సిల్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లు రజిత, కమిషనర్ చిట్యాల సతీష్, మేనేజర్ కరుణాకర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ యశ్వంత్ కుమార్, ఎంఈ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

పూత లేని మామిడి

- ప్రతికూల వాతావరణంతో రైతుల్లో ఆందోళన
- శాపంగా మారిన మబ్బులు... పొగమంచు
- చీడల పీడల ఉధృతితో దిగుబడిపై ప్రభావం



నెన్నెలలో పూతకు రాని మామిడి తోట

నెన్నెల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలు పూతకు వచ్చి పిందెకట్టే సున్నితమైన సమయంలో వాతావరణంలో చోటు చేసుకున్న అనూహ్య మార్పులు రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. డిసెంబరు ఆఖరు వారంలోనే పూర్తిస్థాయి పూతకు రావాల్సిన చెట్లు ఇంతవరకు మొగ్గ కూడ కట్టక పోవడంతో దిగుబడిపై గుబులు పట్టుకుంది. చలితీవ్రతలో హెచ్చుతగ్గులు, అకాల వర్షాలు, రోజుల తరబడి మబ్బులతో పాటు పొగ మంచు కమ్ముకొని ఉండటం, చీడపీడల దాడి లాంటి పరిణామాలతో పూత వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. ఆలస్యంగా పూతవచ్చినా అది పిందెకట్టదని చెబుతున్నారు. రైతులు నవంబరు నుంచే వేల రూపాయల పెట్టుబడులు పెట్టి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టారు. ప్రతికూల పరిస్థితులతో మామిడి రైతులు నిరాశలో మునిగిపో గా, ఈ పాటికే లక్షలు చెల్లించి తోటలు లీజుకు తీసుకున్న గుత్తేదారులు లబోదిబోమంటున్నారు.

● **జిల్లాలో 22 వేల ఎకరాల్లో సాగు..**

మామిడికి మంచిర్యాల జిల్లా పెట్టింది పేరు. జిల్లాలో వరి, పత్తి తరువాత ప్రధాన పంట మామిడే. జిల్లాలో 22 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఎక్కువ శాతం నెన్నెల, జైపూర్, చెన్నూరు. తాండూర్, మందమర్రి, కోటపల్లి, బెల్లంపల్లి మండలాల్లోనే ఉన్నాయి. దేశంలో లభించే అన్ని రకాల మామిడి పండ్లు ఇక్కడ లభ్యం అవుతాయి. బంగినపల్లి, దశేరి, లంగ్డా, చెరుకురసాలు, తోతాపరి, పంచదార, సుందరి, పొనాస, నీలం, కొత్తపల్లి కొబ్బరి లాంటి వందకు పైగా వివిధ రకాల మామిడి పండ్లు ఈ ప్రాంతంలో సాగవుతాయి. ఇక్కడి మామిడి కాయలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

● **ఐదేళ్లుగా నష్టాలే...**

మామిడి రైతుల పరిస్థితి ఏటేట దిగజారిపోతోంది. ఒకప్పుడు మంచి దిగుబడితో ఆదాయం పొందిన రైతు లకు ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అతి వృష్టి, అనావృష్టి, గాలిదుమారాలు, వడగళ్ల వానలు, చీడ పీడలు, తెగుళ్ల కారణంగా ఐదేళ్లుగా మామిడి రైతులు వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ఈ యేడు సైతం ఆశించిన దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

ప్రతికూల వాతావరణం.. చీడపీడల దాడి

మామిడికి వాతావరణం ప్రతికూలంగా ఉంది. చలితీవ్రత, రోజుల తరబడి మబ్బులు పట్టి ఉండటం, అకాల వర్షాలు లాంటి అంశాలు మామిడి పూతపై ప్రభావం చూపిస్తున్నాయి. చెట్లు ఇప్పటికే పూర్తి స్థాయి పూతకు రావాల్సి ఉండగా.. ఈ సారి ఆలస్యం అయ్యేలా ఉంది. ఫిబ్రవరి మొదటి వారం వరకు పూత కు వచ్చే అవకాశం ఉందని అధికారులంటున్నారు. దీని కి తోడు రోజుల తరబడి మబ్బులు పట్టి ఉండటంతో తెగుళ్ల, చీడపీడల ఉధృతి పెరిగింది. తోటల్లో తేనెమంచు, బూడిద తెగుళ్ల, రసం పీల్చే పురుగులు కనిపిస్తున్నాయి. బల్లిపాతర (బూజు) అధికంగా ఉందని రెతులంటున్నారు. వీటి వల్ల దిగుబడిపై ప్రభావం పడుతుంది. పూత ఆ లస్యంగా వచ్చినపుడు కాయ పెరుగుదల దశలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి పొడి వాతావరణం ఉంటుంది. రసం పీల్చే పురుగులు ఆశించి నష్టపరిచే అవకాశం ఉందని నిపుణులంటున్నారు.



ఆకుజల్లెడ పురుగు సోకిన మామిడి చెట్టు

పూత జాడే లేదు



- జంబి లచ్చన్న, మామిడి రైతు, నందులపల్లి, నెన్నెల మండలం

డిసెంబరు ఆఖరు కల్లా తోటలన్ని పూతకు రావాలి. ఇప్పటికి పూత జాడే లేదు. అంతంత మాత్రంగా వస్తు న్న పూత మబ్బులు, పొగమంచుతో మాడి పోతోంది. చీడపీడలు కూడా ఎక్కువయ్యాయి. ఆలస్యంగా వచ్చే పూత పిందెకడ్తుందనే నమ్మకం లేదు. పెట్టిన పెట్టుబ డి కూడా చేతికి వచ్చేలా లేదు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



-అరుణ్‌కుమార్, హార్టికల్చర్ అధికారి, బెల్లంపల్లి

మామిడి పూత రావడం పలు అంశాలపై ఆధార పడి ఉంటుంది. ఇప్పటికైనా తగు జాగ్రత్తలు పాటిస్తే పూత వచ్చే అవకాశం ఉంది. వచ్చిన పూతను సంర క్షించకుని నష్టాలను పూడ్చుకోవచ్చు. ప్రస్తుత సమ యంలో నీటి తడులను నిలిపేసి తోటలకు బెట్ట పరిస్థి తి కల్పించాలి. తోటల్లో ఎలాంటి సమస్యలున్నా అధికా రులను సంప్రది స్తే తగిన సూచనలు సలహాలిస్తారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం

వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య



ఆంధ్రజ్యోతి : పట్టణంలో గంజాయి వి క్రయాలు, రవాణా కట్టడి కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌హెచ్‌వో : గంజాయి రహిత స మాజం కోసం విస్తృతంగా తనిఖీలు చేప డుతున్నాం. గత ఏడా ది 11 కేసులు న మోదు చేసి 19 మందిని అరె స్టు చేశాం. తరుచూ గంజా యి విక్రయించే వా రిపై గంజషీట్ ఓపెన్ చే శాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవ గాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వన్‌టౌన్‌పోలీస్‌స్టేషన్ రా ష్ట్ర వ్యాప్తంగా సత్వర సేవలందించడంలో మూడవ స్థానం రావడానికి ఎలాంటి కృషి చేశారు?

ఎస్‌హెచ్‌వో : కేసుల దర్యాప్తు విష యంలో వేగవంతంగా పరిష్కరించడం, ఫిర్యాదు దారులకు న్యాయం జరుగుందనే నమ్మకం కలిగించడం వంటి కృషితో ఫలి తం దక్కింది. ప్రతి ఒక్క సిబ్బంది కూడా ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా ప్రవ ర్తించి సమస్యలను చట్ట పరిధిలో పరి ష్కరించడంలో ముందున్నాం.

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల పరిర క్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్‌హెచ్‌వో : నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పట్టణంలో వ్యాపారస్తులతో సమావేశాలు నిర్వహించి ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చే సుకోవాలని సూచించాం.

- బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి)

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

బెల్లంపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :విద్యారంగం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదిని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రూ. 8.10 లక్ష ల వ్యయంతో పాఠశాల అదనపు తరగతి గదిని నిర్మించుకోవడంతో విద్యార్థులకు మెరుగైన వసతులు ఏర్పడ్డాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కారుకూరి రాంచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో అదనపు గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్న తెలంగాణ జట్టు

బెల్లంపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : 68వ నేషనల్ సాఫ్ట్‌బాల్ ఎస్‌జీఎఫ్ అండర్ 19 పోటీల్లో తెలంగాణ జట్టు రాణిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బొంకూరి బాబురావు, తెలంగాణ టీం హెడ్ మంతెన సమ్మయ్య శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 23 నుంచి పోటీలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణ బాలుర జట్టు గుజరాత్‌పై 5-6 తేడాతో తొలి విజయం సాధించిందన్నారు. గెలుపొందిన జట్టును డీఈఈవో కె. అంజయ్య అభినందించినట్లు తెలిపారు.



గుజరాత్ జట్టుపై గెలిచిన తెలంగాణ జట్టు

చెన్నూరు ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని పూజలు

మందమర్రి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని రామ కృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియం వద్ద గల కృష్ణాలయంలో శుక్రవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలంటూ 21వ వార్డు కౌన్సిలర్ పార్వతి విజయ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు చేయించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటం పెట్టాలి

దండేపల్లి, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): గణతంత్ర వేడుకల రోజున ప్రతి జెండా కార్యక్రమం వద్ద అంబేద్కర్ చిత్రపటం పెట్టాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి బచ్చల అంజన్న డిమాండ్ చేశారు. అంబేద్కర్ చిత్రపటం పెట్టకుండా జెండా ఎగురవేసే అధికారులపై నేరుగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాసిపేట : గణతంత్ర వేడుకల్లో భారత రాజ్యాంగ చిత్రపటంతో పాటు అంబేద్కర్ చిత్రపటం ప్రదర్శించాలని ధర్మ సమాజ్‌పార్టీ మండల అధ్యక్షుడు గొడిసెల సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడుతూ రాష్ట్రంలో ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార జేఏసీ ఆధ్వ ర్యంలో లక్ష పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టామన్నారు. చిత్రపటాలను ప్రదర్శించాలని పోస్టు కార్డులను ప్రభుత్వానికి పంపుతున్నామన్నారు. అజయ్, వంశీ, సాగర్, ప్రణయ్ పాల్గొన్నారు.

జైపూర్ : ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో భారత రాజ్యాంగ పీఠికను చదవాలని డీఎస్పీ చెన్నూరు నియోజకవర్గ నాయకుడు రేగుంట రాకేష్ పేర్కొన్నారు. శుక్రవారం లక్ష పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఇందారం నుంచి పోస్టుకార్డులను పంపించారు. రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు పోస్టు కార్డులు పంపుతున్నామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దండేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతూ శుక్రవారం మండలంలోని మామిడిపల్లి, మదాపూర్ గ్రామాలోని తెలంగాణ సాంస్కృతి సారథి కళాకారులచే ఆటపాటతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఆటపాటలతో కళాజాత ప్రదర్శించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలద్వారా అందిసిన వైద్య సేవలపై ప్రజలకు ఆటపాటతో వివరించారు. అసంక్రమణ వ్యాధులు బిపి, షుగర్, క్యాన్సర్ లాంటి వ్యాధులపైన సంక్రమణ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా దోమలు పెరగడం వాటిని నిర్మూలించడానికి పుట్టకుండా చూసుకోవడానికి చేపట్టేన చర్యలు, కుష్టు వ్యాధి, కుటుంబ నియంత్రణ, ఎయిడ్స్, హెచ్ఐవి ఇతర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాళ్ళపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ కాంత్రికుమార్, రవళిక, శ్వేత, కళాకారుల టిమ్ లీడర్ల లావుడ్యా రమేష్, కళాకారులు కృష్ణ, రాజతిరుపతి, సత్యం, సంతోష్, కృష్ణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మామిడిపల్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అనర్హులను తొలగించాలి

కోటపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్లగామ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అనర్హులను తొలగించాలని శుక్రవారం పుల్లగామ గ్రామస్థులు ఎంపీడీవో లక్ష్మయ్యకు వినతి పత్రం అందించారు. నిబంధనల ప్రకారం భూమి లేని నిరుపేదలకు ఈ పథకం అందించాల్సి ఉండగా భూమి ఉన్న వారి పేర్లు పథకంలో చేర్చారని వారు తెలిపారు. వెంటనే విచారణ జరపాలని కోరారు.

రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్హులైన రైతులు ఏసంగి పంట పెట్టుబడికి ఆర్థిక సహాయంలో భాగంగా రైతు భరోసాకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటి లోపు పట్టా పాసు పుస్తకం కలిగిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారా లను ఈ నెల 31లోగా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో అందించాలని సూచించారు. గతంలో రైతుబంధు పొందిన వారు దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదని సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా..

ఉత్తమ సేవలందిస్తున్న రాఘవేంద్ర ట్రస్టు

జన్నారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పేదలకు కనీస అవసరాలను దృష్టిలో ఉంచుకుని మేమున్నామంటూ ప్రజా సంక్షేమం కోసం సేవలందించడంలో రాఘవేంద్ర ట్రస్టు ముందుంటోంది. జన్నారం మండలంలోనే కాకుండా నిర్మల్ జిల్లాలోని దస్తూరాబాద్, కడెం మండలాలతో పాటు దండేపల్లి మండలాల ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ ముందుకు వెళ్తుంది. అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి యేడు నిరుపేద వర్కర్లు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు గొడుగులు, స్వెట్టర్లు అందజేస్తున్నారు. అలాగే పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్నారు. మండల ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యం అందాలని జిల్లా కేంద్రానికి చెందిన కార్పొరేట్ ఆసుపత్రుల స హకారంతో వైద్య శిబిరాలను నిర్వహించడం, ఆపరేషన్‌లకు ఆర్థిక సహాయం అందించడం చేస్తున్నారు. రాఘవేంద్ర ట్రస్టు అధినేత, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ చలి కాలంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు పేదింటి ఆడపిల్ల ల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఉన్న రాఘవేంద్ర జూనియర్, కరిమల జూనియర్ కళాశాలల్లో పేద విద్యార్థులను అన్ని రకాలుగా ఆదుకుంటూ, తక్కువ ఫీజులు తీసుకోవడం, రాఘవేంద్ర లిటిల్ హ్యాండ్స్ పాఠశాలలో పేద విద్యార్థులు కొంత మందికి ఫీజులు లేకుండా చదువు చెబుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్ల అందించారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాఘవేంద్ర ట్రస్టు సభ్యులు (ఫైల్)

రానున్న రోజుల్లో మరిన్ని సేవలు

ఎర్ర చంద్రశేఖర్, ట్రస్టు వ్యవస్థాపకుడు, మాజీ జడ్పీటీసీ

రాఘవేంద్ర ట్రస్టు ద్వారా రానున్న రోజుల్లో మరిన్ని సేవలందిస్తాం. మండలంలో ఇప్పటికే చాలా మంది నిరుపేదలు, అన్ని వర్గాల వారికి సహాయ సహకారాలు అందిస్తున్నాం. వీధి వ్యాపారులు ఎండకు, వానకు ఇబ్బందులు పడకుండా గొడుగులు అందజేశాం. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

ట్రస్టు ద్వారా ఆలయ నిర్మాణాలకు సహకరిస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరవుతున్నాము.

భవన నిర్మాణ సంఘం ప్రమాణ స్వీకారం



భవన నిర్మాణ సంఘం నూతన కమిటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


గర్మిళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలో ఇటీవల భవన నిర్మాణ సంఘం ఎన్నికలు జరగగా శుక్రవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హాజరై భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు పడాల రామన్న, పాలకవర్గ సభ్యులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం, సంఘం అభివృద్ధికి పాటు పడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడి అరెస్టు

జన్నారం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జన్నారం మండలం కృష్ణాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాడి మురళి ఓ వ్యాపారం విషయంలో మాయ మాటలు చెప్పి మోసం చేయడంపై అతడిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు జన్నారం ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జన్నారం మండలం కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మామిడి నర్సయ్యను ఆదే మండలానికి చెందిన జాడి మురళి తన్విత ఆయుర్వేదం స్కీమ్‌లో 24 లక్షలు పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తున్నాయని మాయమాటలు చెప్పి తనను మోసం చేశాడని గత నెల 14న జన్నారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై రాజావర్ధన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

జన్నారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మండలం యెల్లారం గ్రామానికి చెందిన టేకుమట్ల రజిత(28) అనే వివాహిత బైక్‌పై నుంచి పడి శుక్రవారం రాత్రి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు రజిత తన తండ్రితో కలిసి శుక్రవారం సాయంత్రం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్న క్రమంలో బైక్‌కు ఎదురుగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడిపోయారు. దీంతో రజిత తలకు తీవ్ర గాయాలు కాగా ఆమెను లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. మృతురాలుకు ఇద్దరు కుతుర్లు ఉన్నారు.



మెగా రక్తదాన శిబిరం

గర్మిళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి రక్తనిధి కేంద్రంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 125 యూనిట్ల బ్లడ్ సేకరించినట్లు అసిస్టెంట్ శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మహేందర్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రావు, సుధాకర్, రాజేంద్ర ప్రసాద్, బాలేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యాగశాలల మండపాల నిర్మాణాలకు భూమిపూజ



నస్పూర్‌లో యాగశాలలకు భూమి పూజ చేస్తున్న స్వామిజీ

నస్పూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలో ఏర్పాటు చేసే యాగశాలల మండపాలకు శ్రీ కృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఫిబ్రవరి 15 నుంచి మార్చి 3 వరకు మహాయాగ మహోత్సవం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఇక్కడ జరుగనున్నాయి. ఇందులో భాగంగా స్వామిజీ యాగశాలల మండపాల నిర్మాణాల పనులకు భూమి పూజ చేశారు. మండపాల ఏర్పాటుతో పాటు మహా శివరాత్రి సందర్భంగా 50 అడుగుల శివలింగం, 70 అడుగుల కోదండరాముడు, శ్రీకృష్ణ గోవర్ధన గిరి, కిలో మీటర్ పొడవునా విద్యుత్ కాంతుల దీపాలంకరణ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. శిష్య బృంద సభ్యులు జగన్‌మోహన్‌రావు, ప్రసాద్, రాజేశం, శేఖర్ ఉన్నారు.

ముగియనున్న మున్సిపాలిటీల పదవీకాలం..



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

- రేపటి వరకే పాలకవర్గాల పాలన
- ఐదేళ్ల క్రితం కొలువుదీరిన పాలకవర్గాలు
- కొన్నిచోట్ల సంవత్సరం క్రితమే ముగిసిన బాధ్యతలు
- బల్దియాల్లో బాధ్యతలు చేపట్టనున్న ప్రత్యేకాధికారులు

మంచిర్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పదవీకాలం రెండు రోజుల్లో ముగియనుంది. ఇప్పటికే గ్రామీణ స్థానిక సంస్థల పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లగా....ఈ నెల 26న మున్సిపాలిటీల పదవీకాలం కూడా ముగుస్తోంది. స్థానిక సంస్థల గడువు ముగిసేలోగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనందున బల్దియాల్లో కూడా ప్రత్యేకాధికారులు పాలనా పగ్గాలు చేపట్టనున్నారు.

అవిశ్వాస తీర్మానాలతో...

జిల్లాలో మంచిర్యాలతో పాటు నస్పూర్, చెన్నూర్, లక్షెట్టిపేట, మందమర్రి, క్యాతనపల్లి, బెల్లంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. మందమర్రి మున్సిపాలి పరిధిలో 1/70 ఏజెన్సీ చట్టం అమలులో ఉండటంతో అక్కడ దశాబ్ధాలుగా ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో అధికారుల పాలనలోనే మున్సిపాలిటీ నడుస్తోంది. మిగతా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పాలకవర్గాలున్నాయి.

బల్దియాలకు 2020లో ఎన్నికలు జరిగాయి. చెన్నూరు, బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపాలిటీలు మినహా మంచిర్యాల నియోజక వర్గ పరిధిలోని నస్పూర్, మంచిర్యాల, లక్షెట్టిపేటలో గత సంవత్సరం రాజకీయాలు ఒక్కసారిగా మలుపు తిరిగాయి. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజక వర్గ ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేంసాగర్‌రావు భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో ఆయన నియోజక వర్గంలోని మున్సిపాలిటీలపై దృష్టిసారించారు. అప్పటి వరకు బీఆర్‌ఎస్ పాలకవర్గాలు ఉండగా, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సభ్యులంతా అధికార పార్టీలోకి వెళ్లారు. దీంతో నియోజక వర్గంలోని నస్పూర్, మంచిర్యాల, లక్షెట్టిపేట మున్సిపాలిటీలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకునేందుకు అవిశ్వాస తీర్మాణాలు ప్రవేశపెట్టారు. అనుకున్న విధంగానే మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలు కాంగ్రెస్ కైవసం కాగా అప్పటి వరకు బీఆర్‌ఎస్ చైర్మన్లుగా కొనసాగిన పెంట రాజయ్య, ఈసంపెల్లి ప్రభాకర్ బలనిరూపణలో వెనుకబడటంతో పదవీచ్యుతులు అయ్యారు. వారి స్థానంలో రావుల ఉప్పలయ్య (మంచిర్యాల), సురిమిల్ల వేణు (నస్పూర్) చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే వైస్ చైర్మన్లుగా కొనసాగిన గాజుల ముకేష్ గౌడ్ (మంచిర్యాల), తోట శ్రీనివాస్ (నస్పూర్)ల స్థానంలో నల్ల మహేష్(మంచిర్యాల), గెల్లు రజిత (నస్పూర్)లు పదవుల్లో కొనసాగుతున్నారు. అవిశ్వాస తీర్మాణాల కారణంగా మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు నాలుగేళ్లకే పదవుల్లో నుంచి తప్పుకోవలసి రాగా, కొత్తగా నియమితులైన వారు ఒక సంవత్సరంపాటు పదవులను అలంకరించారు. ఇదిలా ఉండగా లక్షెట్టిపేట మున్సిపాలిటీలో మాత్రం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయినందున 2020లో చైర్మన్, వైస్ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన బీఆర్‌ఎస్ నాయకులు నల్మాసు కాంతయ్య, పోడేటి శ్రీనివాసగౌడ్ పూర్తిస్థాయి పదవీ బాధ్యతలు నిర్వర్తించారు.

ప్రత్యేకాధికారుల పాలనకు ఏర్పాట్లు....

పాలకవర్గాల గడువు తీరనుండటంతో ప్రత్యేకాధికారుల పాలనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా ఏర్పడనుండటంతో ఇక్కడ ప్రత్యేకాధికారిగా..

(తరువాయి 7వ పేజీలో)

మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరపండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సాధన కమిటీ వినతి



కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న కమిటీ సభ్యులు

మందమర్రిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ ఎన్నికల సాధన కమిటి ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఎన్నికలు లేకపోవడం వల్ల తలెత్తుతున్న ప్రజా సమస్యలను సాధన కమిటీ సభ్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటి కన్వీనర్ అందుగుల శ్రీనివాస్, కో కన్వీనర్ మేడిపెల్లి సంపత్, డీవీ దీక్షిత్, మాయ రమష్, బండారి సూరిబాబు, పాల్గొన్నారు. అక్కడ నుంచి ఆదిలాబాద్ ఎంపీ గడ్డం నాగేష్‌ను కూడా కలిసి ఎన్నికలపై వినతి పత్రం అందజేశారు.

లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కదంతొక్కాలి

- వర్గీకరణ కోసం మాదిగలు ముందుండాలి



మందమర్రిలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మందమర్రి టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమానికి మాదిగ కుటుంబాలు కదం తొక్కాలని ఆదిజాంబవ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక సింగరేణి పాఠ శాల మైదానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున వర్గీకరణ కోసం చేపడుతున్న కార్యక్రమానికి పని చేయాలన్నారు. మందమర్రి నుంచి ఐదు బస్సుల ద్వారా కార్యక్రమానికి తరలి వెళ్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా సామాజిక వర్గం వర్గీకరణను అడ్డుకోవడం సరికాదన్నారు. అందరికి సమానంగా కావాలన్నదే మందకృష్ణ లక్ష్యమన్నారు. నేటి నుంచి పది రోజుల పాటు ప్రచారం వేయడానికి కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కంబలి రాజనర్సు, శంకర్, సారంగం, సారయ్య, యూత్ విభాగం నాయకులు కిరణ్, సుమన్, రాజన్న, రవి పాల్గొన్నారు.

బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ బీసీలకు రోస్టర్ విధానం అమలు చేసి ఎస్సీ, ఎస్టీల్లాగే పోస్టులు బీసీ వర్గాలకు వర్తింపజేయాలని, కేంద్రంలో రూ. 2 లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని, 50శాతం సీలింగ్ రిజర్వేషన్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్‌లు బీసీలకు అమలు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రమేష్, భీమ్‌సేన్, గజెల్లి వెంకటయ్య, కీర్తిబిక్షపతి, శంకర్, చంద్రమౌళి, సతీష్, కుమార స్వామి, కిరణ్,సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి చర్యలు

- అదనపు కలెక్టర్ మోతీలాల్



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

చెన్నూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. చెన్నూరు మండల కేంద్రంలోని వెనకబడితన తరగతుల సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు శుక్రవారం జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చెన్నూరు పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల ప్రీమెట్రిక్ వసతిగృహం విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు తన సొంత ఖర్చులతో ఆర్‌వో ప్లాంట్‌ను విరాళంగా అందించి 30 మంది విద్యార్థినులకు దుప్పట్లు, 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్కూల్ బ్యాగ్స్ స్లిప్పర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతి గృహం అధికారులు మొహిసిన్ అహ్మద్, సుభద్ర, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కర్పూరి ఠాకూర్ జయంతి



కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నరెడ్ల శ్రీనివాస్, నాయిబ్రహ్మణ సంఘం నాయకులు

గర్మిళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలో శుక్రవారం కర్పూరి ఠాకూర్ 101వ జయంతిని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నాయిబ్రహ్మణ కుటుంబం నుంచి వచ్చిన ఠాకూర్ ప్రజల అభ్యున్నతికి అనేక పోరాటాలు చేశారన్నారు. నాయి బ్రహ్మణులు రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, భీమయ్య, శ్రీను, నాగలక్ష్మీ, జయప్రద, జ్యోతి, సూరయ్య, ఉమా దేవి, సదానందం, రమేష్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : బీసీ ఐక్యవేదిక సంఘం నాయకులు, బీసీ సామాజిక వేత్త కర్పూరి ఠాకూర్ జయంతిని మంచిర్యాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మలయ్య, రాజేశం, అంజయ్య, రామదాసు, జయరావు, రాజేశంగౌడ్, కిరణ్, శంకరయ్య, రాజన్న, తిరుపతి పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్



భీమారంలో మాట్లాడుతున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

భీమారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఐ శ్వేతతో కలిసి రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులతో పాఠశాల నుంచి బస్టాండ్ మీదుగా ఐబీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనానికి సంబంధించిన అన్ని ధృవీకరణపత్రాలు కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఎడమ చేతి వైపు రోడ్డు డివైడర్ ఉన్న ప్రాంతం నుంచే పాదాచారులు నడవాలని, జీబ్రా క్రాసింగ్ ఉన్న చోట రోడ్డును దాటాలని సూచించారు. చదువుకునే వయస్సులో విద్యార్థులు వాహనాలను నడపవద్దని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పదవ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాలరావు, క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

పూత లేని మామిడి

- ప్రతికూల వాతావరణంతో రైతుల్లో ఆందోళన
- శాపంగా మారిన మబ్బులు... పొగమంచు
- చీడల పీడల ఉధృతితో దిగుబడిపై ప్రభావం

7



మత్తడికి మరమ్మతులెప్పుడో?

- నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఖర్జీ చెరువు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

6



ఎండిపోయిన ఖర్జీ చెరువు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

గర్మిళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వనితా వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని వనితా వాక్కు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వనితావాక్కు ఫౌండర్, అడ్వకేట్ రంగు వేణుకుమార్, హెడ్మాస్టర్‌పద్మావతి, టీచర్లు, సఖి, వనితా వాక్కు సభ్యులు జ్యోత్స్నచంద్రదత్, అన్నపూర్ణ, కవిత, సునీత, చందన, కరుణ, కల్పన, అనసూయ, వనజ పాల్గొన్నారు.



బాలికల పాఠశాలలో బాలిక దినోత్సవంలో పాల్గొన్న వనితావాక్కు సభ్యులు

భీమిని : బాలికల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ బాలికల అభ్యున్నతికి పాటుపడాలని, వారి హక్కులను రక్షించేలా కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలో బాలికలు వేసిన ముగ్గులను పరిశీలించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ దీపిక, మహేశ్వరి, ఇన్‌చార్జి ఎస్‌వో శారద పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ, మోడల్‌స్కూల్, కళాశాలలో సోమవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేజీబీవీలో ప్రత్యేకాధికారిణి హరిత ఆధ్వర్యంలో విద్యార్థినులు రంగ వల్లులు వేశారు. బాలికల విద్య ప్రయోజనాలపై ఉపాధ్యాయులు వివరించారు. మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు జరగగా బాలికలకు పోటీలు నిర్వహించారు.

తాండూర్: తంగళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాండూర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాదారం ఎస్‌ఐ సౌజన్య పాల్గొని మాట్లాడారు. ఆధునిక యుగంలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఆడ పిల్లలపై వివక్ష ఉందని, చదువు, ఉద్యోగాల విషయంలో వారిని వెనక్కి లాగేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ కేశెట్టి సంతోష్‌కుమార్, మైలారం మధుసూదన్, మణికృష్ణ, మహేష్, భాస్కర్, వెంకటరమణ, ఉపాధ్యాయులు ప్రకాష్,అరుణ, నరేందర్, వర ప్రసాద్ పాల్గొన్నారు.